RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక
ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



## శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకపై దాడి
101 మంది గల్లంతయినట్లు సమాచారం
-2లో

జైలు నుంచి విడుదలయిన
## బాల్క తదితరులు

క్యాతన్‌పల్లిలో మంత్రి వివేక గూండాగిరీ

మీడియా ముందు బాల్క సుమన్ ఆరోపణలు


-2లో

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :169 | గురువారం 05 మార్చి 2026 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

## అంతర్జాతీయ మహిళ దినోత్సవం కానుక

6 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీ

ఈ నెల 8 నుంచి స్క్రీనింగ్ ప్రారంభం

టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కొక్కరికీ 30 రకాల పరీక్షలు

4 దశల్లో ఆరోగ్యశాఖ కార్యక్రమాలు

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష


-8లో

తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు.

## యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో అవినీతి

త్వరలోనే వివరాలు బయటపెడతాం

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు
-2లో

త్వరలోనే వివరాలు బయటపెడతాం

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు




-2లో

## ఐదోరోజూ పరస్పర దాడులు

ఇజ్రాయిల్ దాడులకు దీటుగా ఇరాన్ బాంబులు

టెహ్రాన్ ప్రార్థనా మందిరంలో ఖమేనీ భౌతిక కాయం

మూడ్రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి



## సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

త్వరలోనే స్వయంగా డ్యామ్ ను సందర్శిస్తా

ప్రాజెక్టుల భూసేకరణకు 5000 కోట్లు

జూన్ 2 నాటికి భూసేకరణ పూర్తి

పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా
-2లో

ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి

అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు ప్రాజెక్టులపై మంత్రులు, అధికారులతో సచివాలయంలో సమీక్ష





ప్రస్తుతం 83 మందే ఉన్నారు.. 105 మందికి పెంచండి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహకరించండి

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

## ఐపీఎస్‌లు కావాలి

"జనజీవన స్రవంతిలో కలుస్తున్న మావోయిస్టు నాయకులు, ఇంకా అజ్ఞాతంలో ఉన్న వారి గురించి సమావేశంలో చర్చకొచ్చింది."

హైదరాబాద్: పెరుగుతున్న అవసరాల దృష్ట్యా రాష్ట్రానికి మరింత మంది ఐపీఎస్ అధికారులను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరారు. ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికి అదనంగా ఐపీఎస్ అధికారుల అవసరం ఉందన్నారు. పోలీసు అధికారులతో కలిసి ముఖ్యమంత్రి బుధవారం దిల్లీలో అమిత్‌షాతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో మొదటిసారి క్యాడర్ రివ్యూ జరిగింది. 2021లో జరగాల్సిన రివ్యూ ఇంకా ఆలస్యంగా 2025లో జరిగింది. ఆ సమయంలోనూ ఏడుగురు ఐపీఎస్‌లను మాత్రమే తెలంగాణకు కేటాయించారు. ఈ ఏడాది మరోమారు క్యాడర్ రివ్యూ నిర్వహించాలి. ప్రస్తుతం తెలంగాణలో 83 మంది ఐపీఎస్ అధికారులు మాత్రమే ఉన్నారు. ఈ సంఖ్యను 105కు పెంచండి' అని రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో రాజధాని పరిధిలో ఉన్న మూడు కమిషనరేట్లను పునర్‌వ్యవస్థీకరించడంతో పాటు కొత్తగా ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ ఏర్పాటు చేసిన విషయాన్ని కూడా అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నింటి దృష్ట్యా తెలంగాణకు మరింత మంది ఐపీఎస్‌లు కావాలని, దీనిపై కేంద్రం సత్వరమే నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ కార్యకలాపాలు, సైబర్‌నేరాల నియంత్రణలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోషిస్తున్న పాత్ర గురించి వివరించారు.

-2లో

## మండలిని కుదిపేసిన తిరుమల లడ్డూ వ్యవహారం

మంత్రి అచ్చన్న క్రిస్టియన్ వ్యాఖ్యలపై మండిపడ్డ వైసిపి

స్పీకర్ పోడియం వద్ద ఆందోళనకు దిగిన వైసిపి సభ్యులు

అచ్చన్న క్షమాపణలు చెప్పాలని డిమాండ్

స్పీకర్ మోషెన్ రాజుకు మంత్రి అచ్చన్న క్షమాపణలు

గందరగోళం మధ్య వాయిదా..తిరిగి నేటికి సభ వాయిదా


## ఇది మనిషి సృష్టించిన పెను విషాదం

**ఇరాన్‌లో పాఠశాల బాలికల మృతిపై కెటిఆర్**

**హైదరాబాద్: ,మనసాక్షి:**ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానిక దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది. ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి. ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు.



## అభిషేక్ సింఘ్వీ.. వేం నరేందర్‌రెడ్డి!



**హైదరాబాద్:,మనసాక్షి:** తెలంగాణ నుంచి రాజ్యసభకు రెండో అభ్యర్థిగా సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డినే కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసినట్లు తెలిసింది. ఒక స్థానానికి సిటింగ్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పేరును ఎంపిక చేయగా, ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ వచ్చారు. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చలు, సంప్రదింపుల తర్వాత వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేసినట్లు సమాచారం. ఈయనకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టిగా కోరడం, అందరితో సన్నిహిత సంబంధాలుండే నరేందర్‌రెడ్డి పేరుపై ఎవరి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో అధిష్ఠానం కూడా చివరకు సీఎం మాటకే ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. బుధవారం రాత్రి 11 గంటల వరకు అధికారికంగా కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల చేయలేదు. నామినేషన్ల దాఖలుకు గురువారం గడువు ముగియనుంది. ఒకవేళ భారాస తన అభ్యర్థిని రంగంలోకి దింపితే రెండో స్థానానికి పోటీ అనివార్యమవుతుంది. బుధవారం రాత్రి వరకు ఆ పార్టీ ఈ విషయంలో ఒక నిర్ణయానికి రాలేదని సమాచారం. భారాస పోటీలో లేకుంటే రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకుంటుంది. మొదటి స్థానానికి అభిషేక్ సింఘ్వీ ఎన్నికకు ఎలాంటి సమస్య లేదు. రెండో స్థానానికి అవసరమైన మెజార్టీ కాంగ్రెస్‌కు లేదు. ఎంఐఎంపై ఆధారపడాల్సి ఉంటుంది. భారాస పోటీలో ఉంటేనే రెండో స్థానాన్ని దక్కించుకోవడానికి ఇతరుల మద్దతు కూడగట్టాల్సి ఉంటుంది. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. రెండోస్థానం కోసం కాంగ్రెస్‌లో పలువురు నేతలు తీవ్రంగా పోటీపడ్డారు. తన సన్నిహితుడు, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య కీలకంగా వ్యవహరిస్తున్న వేం నరేందర్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి మొదటి నుంచి కోరుతూ వస్తున్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వానికి, పార్టీకి మధ్య సమన్వయం చేస్తుండటం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, పంచాయతీ, పురపాలక సంఘాల ఎన్నికల్లో క్రియాశీల పాత్ర పోషించడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆయనకు అవకాశమివ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిసింది.

## మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

### రాహుల్‌కు మందకృష్ణమాదిగ లేఖ



వరంగల్: రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

### సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన రాజాసింగ్



హైదరాబాద్:హిందు పండుగలు, ముస్లింల పండుగల మధ్య తెలంగాణ ప్రభుత్వం తేడాలు ఎందుకు చూపిస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. అలాగే హిందూ పండగలపై చిన్నచూపెందుకని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే హిందువుల కోసం ప్రత్యేక వేడుకలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ ప్రకటన చేసేలా చూడాలని కోరారు. రంజాన్ కోసం ఇఫ్తార్ మాదిరిగా హిందువుల కోసం నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల ఓట్ల కోసం ఇఫ్తార్ వేడుకలను చేసే నేతలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల గురించి టోపీ పెట్టుకొనే రాజకీయ పార్టీలకు హిందువులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.

## ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నదే లక్ష్యం



అమరావతి:: ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలన్నదే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేసి బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల బిల్లు సవరణకు సంబంధించిన బిల్లును మంత్రి లోకేశ్ బుధవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025 సెప్టెంబర్ 27వ తేదీన అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదించి శాసనమండలికి పంపించామని ప్రస్తావించారు. అక్కడ బిల్లు ప్రవేశపెట్టలేదని... వంద రోజులు దాటడంతో మళ్లీ బిల్లు అసెంబ్లీకి వచ్చిందని చెప్పుకొచ్చారు. 1996లో చంద్రబాబు సీఎం అయ్యాక ఫ్యాక్షన్ రాజకీయాలపై యుద్ధం ప్రకటించారని గుర్తుచేశారు. 2004 తర్వాత దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 164మంది తెలుగుదేశం కార్యకర్తలను దారుణంగా చంపేశారని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలను పరామర్శించి వెళ్లే లోపే మరో హత్య జరిగిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ఈ హత్యలకు గురైన వారి పిల్లలను చదివించేందుకు ఎన్టీఆర్ స్కూల్లో ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆ పిల్లలు ఫ్యాక్షన్‌లోకి వెళ్లకుండా మంచి భవిష్యత్తు ఉండేలా తాము చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ ప్రభుత్వం ప్రయత్నించిందని అన్నారు. 2019 నుంచి 2024 మధ్యలో కూడా ఇలాంటి హత్యలు చాలా జరిగాయని ప్రస్తావించారు. బీసీ వర్గానికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి 12వ తేదీన దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఆయన నిలబడ్డారని.. ప్రజల కోసం పోరాడారని కీర్తించారు. నడిరోడ్డుపై చంద్రయ్యను గొంతు కోసి చంపారని మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. 'జై జగన్' అంటే వదిలేస్తామని చెప్పినా చంద్రయ్య భయపడలేదన్నారు. వైసీపీ హయాంలో 'జై చంద్రబాబు, జై తెలుగుదేశం' అన్నందుకు ఆయనను చంపివేశారని ధ్వజమెత్తారు. చంద్రయ్య హత్య ఎలా జరిగిందో దేశం మొత్తం చూసిందని అన్నారు. చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇవ్వటం కోసం కూటమి పార్టీలు సమ్మతించాయని తెలిపారు. గతంలో శాసనసభలో ఈ బిల్లుకు ఆమోదం లభించినా.. శాసనమండలి దాన్ని పక్కన పెట్టిందని చెప్పుకొచ్చారు. కనీసం బిల్లుని తిరస్కరించినా.. మనం అసెంబ్లీలో ఆమోదించుకునేవాళ్లమని తెలిపారు. తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే బిల్లును అసెంబ్లీలో ఆమోదించాలని, ఫ్యాక్షన్‌కు అడ్డుకట్ట వేసి... ఇలాంటి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని మంత్రి నారా లోకేశ్ కోరారు.

## వేట్లపాలెం ఘటనలో మరోకరు మృతి

### 25కు చేరిన మృతుల సంఖ్య



కాకినాడ: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో మృతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. పంట పొలాల మధ్య నెలకొల్పి తయారీ కేంద్రంలో ఫిబ్రవరి 28న ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 23 మంది సజీవ దహనం కాగా మరో 15 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలయ్యారు. ఈ ఘటనలో బుధవారం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ వీర శ్రీను (39) అనే వ్యక్తి మృతి చెందారు. దీంతో ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 25కు చేరింది. మంగళవారం ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోవరాజు మరణించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మిగిలిన ఐదుగురు క్షతగాత్రులకు వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## మండలిని కుదిపేసిన తిరుమల లడ్డూ వ్యవహారం

అమరావతి:ఏపీ శాసనమండలిలోగందరగోళ పరిస్థితి నెలకొనడంతో చైర్మన్ మోషేన్ రాజు సభను గురువారానికి వాయిదా వేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై తీవ్ర వాదోపవాదాలు నెలకొన్నాయి. ఈక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. చైర్మన్ పోడియం ఎక్కి నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అంతకముందు.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో రగడ చోటుచేసుకుంది. మాజీ సీఎం జగన్‌ను క్రిస్టియన్ అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు ఆందోళకు దిగారు. దీంతో సభను ఒకసారి వాయిదా వేశారు చైర్మన్. తిరిగి మొదలైన తర్వాత కూడా.. జగన్‌కు క్షమాపణ చెప్పాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'జగన్‌ను నేను క్రిస్టియన్ అని అన్నాను, ఆ మాటకు కట్టుబడి ఉన్నాను' అని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని చెప్పమనండి అంటూ సవాల్ విసిరారు. 'టీవీలో చూసి ఉంటారు కదా జగన్... కాదని చెప్పమనండి' అని మంత్రి అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కుటుంబంతో తిరుమల దర్శనానికి ఎందుకు రాలేదని నిలదీశారు. వైసీపీ సభ్యులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. దీంతో వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి జగన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం తీవ్ర వివాదంగా మారి.. పాలక, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతుండగా.. రచ్చకు దారితీసింది.. లడ్డూ అంశంపై చర్చ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. మండలి చైర్మన్ మోషేన్ రాజు ఇద్దరు క్రిష్టియన్స్ అంటూ వ్యాఖ్యానించారు. అయితే, అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు చైర్మన్ మోషేన్‌రాజు.. తాను క్రిస్టియన్ కాదని చెప్పారు.. తాను హిందువునని తెలిపారు మండలి చైర్మన్.. అంతేకాదు.. తనను క్రిస్టియన్ గా మార్చాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడమే కాకుండా.. అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు.. దీంతో, శాసన మండలిలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.. ఈ సందర్భంగా మళ్లీ మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు.. తాను మండలి చైర్మన్ క్రిస్టియన్ అనుకున్నాను.. ఆయన తాను హిందువును అని చెప్పారు.. అందుకే నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకుంటున్నాను అన్నారు.. మండలి చైర్మన్ కు తప్పు అయ్యిందని ఒప్పుకుంటున్నా అన్నారు అయినా, మండలిలో మంటలు తగ్గలేదు.. మొత్తంగా క్రిస్టియన్స్ వ్యవహారంలో మండలిలో రచ్చగా రేపగా.. మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కాసేపు శాసన మండలి వాయిదా పడింది.. ఈ సమయంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రసంగించారు. వైసీపీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రూ. 320లకు కిలో ఆవు నెయ్యి ఎక్కడైనా దొరుకుతుందా?' అని ప్రశ్నించారు. వీళ్లు హిందువులు ఎలా అవుతారంటూ వైసీపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు. రూ. 320లకు ఆవు నెయ్యి కొనాలని అడుగుతున్న వైసీపీ సభ్యులు.. ఎమ్మెల్సీలు ఎలా అయ్యారని నిలదీశారు. సోమువీర్రాజు మాట్లాడుతున్న సమయంలో పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో చైర్మన్ సభను గురువారానికి వాయిదా వేశారు.

## శ్రీలంక తీరంలో ఇరాన్ నౌకపై దాడి

### 101 మంది గల్లంతయినట్లు సమాచారం



కొలంబో: ఇజ్రాయెల్–అమెరికా కూటమి, ఇరాన్ మధ్య యుద్ధంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్‌కు చెందిన నౌకపై జలాంతర్గామి దాడి జరిగింది. ఈ దాడిలో 101 మంది గల్లంతయ్యారు. మరో 78 మంది గాయపడినట్టు శ్రీలంక నేవీ, రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు బుధవారంనాడు తెలిపాయి. వీరిలో 32 మంది పరిస్థితి తీవ్రంగా ఉందని పేర్కొన్నాయి. కాగా, 180 మందితో ఉన్న ఐఆర్ఐఎస్ దేనా నౌక మునిగిపోతున్నట్టు తమకు సమాచారం రావడంతో వెంటనే సహాయక సిబ్బందిని రంగంలోకి దించినట్టు విదేశాంగ మంత్రి విజిత హెరాథ్ తెలిపారు. నౌక వేగంగా మునిగిపోతున్న సమయంలో 32 మందిని సిబ్బంది రక్షించారు. గాలె నగర సమీపంలో దక్షిణ తీరానికి కొద్ది దూరంలో ఈ దాడి జరిగింది. క్షతగాత్రులను గాలేలోని స్థానిక ఆసుపత్రికి తరలించారు. సబ్‌మెరైన్‌తో దాడి జరిపిందెవరనేది వెంటనే వెల్లడి కాలేదు. ఐఆర్ఐఎస్ దేనా నౌక విశాఖపట్నంలో జరిగిన నావికా విన్యాసాల్లో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది.

# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ



అమరావతి: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాల కల్పన ఊపందుకుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆయా అంశాలపై బుధవారం నాడు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘంగా వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ.. 'విద్యాశాఖలో ఐటీని వినియోగించుకున్న అనంతరం ఏఐను సైతం వినియోగించుకుంటున్నారు. మధ్య తరగతి, పేదవారికి యూనివర్సల్ హెల్త్ కవరేజి తేవడంతోపాటు ప్రతి ఒక్కరికీ రూ. 2. 50లక్షల ఇన్సూరెన్స్ ఎన్డీయే ప్రభుత్వం చేసింది. పేద వారికి వైద్యం కోసం ప్రతి ఒక్కరికీ రూ. 20లక్షల వరకూ ఖర్చు చేయడానికి సిద్ధం. పీపీపీ కింద కాలేజీల నిర్మాణం చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేస్తాం అని అన్నారు.
పీపీపీ అంటే ప్రైవేట్ కాదు.. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ మాత్రమే. మాతృభాషలోనే ప్రాథమిక విద్య ఉండాలి. అందుకే దానిని మనం ప్రోత్సహిస్తున్నాం గత పాలనలో చాలా పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయాయి. బ్రాండ్ పోతే చాలా కష్టం. ఆర్బీఐ ఇటీవల ఒక పబ్లికేషన్ ఇచ్చారు. అయితే దీని ప్రకారం మన రాష్ట్రంలో చిన్న పరిశ్రమలు తగ్గిపోయాయి. గత ప్రభుత్వం గంజాయిని ప్రోత్సహించింది తప్ప ఒక్క డీఎస్సీ, ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదు. 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇచ్చాం.. దాన్ని నిలబెట్టుకుంటాం. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని ఉద్యోగాలు కల్పించే కమిటీ చాలా బాగా పనిచేస్తోంది. టూరిజానికి పరిశ్రమల స్థాయి కల్పించాం. నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్క్ పెడుతున్నాం. ఎంఎస్ఎంఈలలో సుమారు 2. 40లక్షల వరకూ ఉద్యోగాలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగాలు 30,500కు పైగా ఇచ్చాం. రాష్ట్రంలో ఇప్పటివరకూ 6,28,327మందికి ఉద్యోగాలు ఇచ్చాం అన్నారు. 20నెలల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు ఒకే మాటగా నిలబడ్డాయి. ఒక్క రూపాయికి విశాఖలో భూమి కేటాయించాలన్నప్పుడు నేను ఆలోచించా. అయితే మొదట టీసీఎస్‌కు ఇచ్చాం. ఈ నిర్ణయంతో అనేక మార్పులు వచ్చాయి. గత 20 నెలల్లో అనేక కంపెనీలు విశాఖకు క్యూ కట్టాయి. ఆర్సెలర్ మిట్టల్ 69 వేల కోట్ల ఫేజ్ వన్‌ను ప్రారంభిస్తారు. అందుకు మార్చి 26న భూమి పూజ చేస్తాం. ఏప్రిల్ నెలలో విశాఖలో గూగుల్‌కు భూమి పూజ చేస్తాం. ఇకపై ఎవ్వరూ ప్రభుత్వం వద్దకు వచ్చే అవసరం లేకుండా వారికి ఇవ్వాల్సిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే అందిస్తాం. అతిథి దేవోభవ మన విధానం.... టూరిజం మా ప్రయారిటీ' అని చెప్పారు. విశాఖ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌తో దూకుడు.. 15 రంగాల్లో 613 ఒప్పందాలు తద్వారా రూ. 13. 25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 16. 13 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి.
ఇప్పటి వరకు 20 నెలల్లో 15 సార్లు ఎస్ఐపీబీ సమావేశం జరిగిది. అందులో మొత్తం 237 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. రూ. 9,03,562 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే 72 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశాం. ఎస్ఐపీబీ ఆమోదంతో 8,54,817 ఉద్యోగాలు వస్తున్నాయి. 77,469 మంది నిరుద్యోగ యువతకు స్కిల్ ట్రైనింగ్‌తోపాటు వర్క్ ఫ్రమ్ హోం ఫెసిలిటీ కల్పిస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాకినాడలో గ్రీన్ హైడ్రోజన్. అలాగే రాష్ట్రానికి ఎల్జీ, ఐబీఎం, కాగ్నిజెంట్, సిఫీ, బీపీసీఎల్, టాటా పవర్, రెన్యూ పవర్, తాజ్, ఐటీసీ, రిలయన్స్, రేమాండ్ వంటి బడా సంస్థలు వస్తున్నాయి. 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. కూటమి ప్రభుత్వం వచ్చాక మొత్తం 6,28,347 ఉద్యోగాలు సాకారమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగాలు 30,607 ద్వారా డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం అని చంద్రబాబు వివరించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి 3 ఎకనామిక్ రీజియన్లుగా రాష్ట్రాభివృద్ధి చేస్తున్నాం. 2047 నాటికి విశాఖ రీజియన్‌లో 800 బిలియన్ డాలర్ల జీడీపీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రంగం అభివృద్ధికి మాస్టర్ ఎ÷–లాన్‌కు రూపకల్పన చేశాం. ఐటీ, జీసీసీ, డేటా సెంటర్ హబ్‌గా విశాఖపట్నం. క్వాంటం సిటీగా అమరావతి. రాయలసీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్టికల్చర్ ప్రాధాన్యం. కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్ ? అనకాపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్. నెల్లూరులో రూ. 95 వేల కోట్లతో బీపీసీఎల్ ర్గి÷నైరీ.. సీమలో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీగా అభివృద్ధి చేస్తున్నాం. అతిథి దేవోభవ అనేది మన విధానం. ఆత్మీయత పంచడంలో మనల్ని మించిన వారు లేరు. టూరిజం కేవలం ఆదాయ వనరు కాదు. తెలుగు నేల సంస్కృతి, సంప్రదాయాలను దశదిశలా చాటే వేదిక.పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాం. క్యాపిటల్ సబ్సిడీ, రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులు, పారదర్శక భూ కేటాయింపులు వంటి చేశాం. హోటళ్లు, రిసార్టులు, టెంట్ సిటీలు, థీమ్ పార్కులు మౌలిక సదుపాయాలలో భారీ పెట్టుబడులు వచ్చాయి. దీంతోపాటు పర్యాటక ఉపాధి, కారవాన్, హోమ్‌స్టే, బి అండ్ బి విధానాలు.. అడ్వెంచర్ స్పోర్ట్స్ మార్గదర్శకాలను రూపొందించాం. టెంపుల్
టూరిజానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం అని అన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో టూరిజం రంగంలో 102 ఓనీజల ద్వారా రూ. 18,448 కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 3,06,648 ఉద్యోగాలను రాబోతున్నాయి. ఎనిమిది ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం రూ. 428 కోట్ల మేర నిధులను గ్రాంట్‌ను అందించింది. రూ. 98 కోట్లతో సూర్యలంక బీచ్, రూ. 94 కోట్లతో అఖండ గోదావరి, రూ. 78 కోట్లతో గండికోట గార్జ్, రూ. 54 కోట్లతో సింహాచలం ఖఖీండఱ÷ాంఆ ప్రాజెక్ట్, రూ. 30 కోట్లతో బొర్రా గుహలు, రూ. 25 కోట్లతో అహోబిలం, రూ. 25 కోట్లతో నాగార్జునసాగర్ బౌద్ధ సర్క్యూట్ చేపట్టాం అని చంద్రబాబు తెలిపారు.

# సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు



హైదరాబాద్:సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్క,వివేక్ వెంకటస్వామి లతో కలసి డాక్టర్ బి. ఆర్. అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6,7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2,3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా
ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2 వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.
సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టు సుందరీకరణ , పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గం లో చిన్న నీటి ప్రాజెక్టులైనా చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు.

## యంగ్ ఇండియా స్కూల్స్ టెండర్లలో అవినీతి

హైదరాబాద్:యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ పనితీరుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. యంగ్ ఇండియా స్కూల్స్‌లో ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదని.. మేము ప్రతిపక్షంగా సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు. ఖమ్మంకు కేటీఆర్ వెళ్లారు.. ఇప్పుడు స్థలాలు ఇస్తాం.. ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్లాను.. అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్లాం. వెంటనే ముఖ్యమంత్రి కూడా వెళ్లారు. హెల్త్ సిటీకి వెళ్లాం ప్రతి దానికి మేము వెళ్లాక స్పందిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారని.. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్డ్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్‌లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్‌లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని.. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారని హరీష్ రావు ఆరోపించారు. అక్కడ రెడీమిక్స్‌కు పర్మిషన్ లేదన్నారు.

## ఐదోరోజూ పరస్పర దాడులు

టెహ్రాన్: ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదోరోజైన బుధవారంనాడు మరింత తీవ్రమైంది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ దాడులు జరుపుతోంది. ఇరాన్‌లోని ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా దాడులను విస్తరించింది. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాక్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్ క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సులేట్‌ను ఢీకొట్టాయి. ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్‌బేస్‌పై కూడా ఇరాన్ క్షిపణి దాడి జరిగింది. కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన హెర్మేస్ డ్రోన్‌ను కూల్చేసినట్టు కెర్మాన్ ప్రావిన్స్‌లోని ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం తెలిపింది. గత 24 గంటల్లో మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ప్రకటించింది. మధ్యప్రాచ్యంలోని ఇరాక్ 'ఎర్బిల్ బేస్', కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్‌బేస్, అరిఫ్‌జాన్ ఎయిర్ బేస్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఇంతవరకూ 230 డ్రోన్లు పేల్చినట్టు తెలిపింది.

## జైలు నుంచి విడుదలయిన బాల్క తదితరులు

ఆదిలాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు

# ఆడపిల్లకు చదువే అసలైన ఆయుధం: డీఎస్పీ శ్రీనివాసరావు

**గుర్రంపోడు, మార్చి 04,మన సాక్షి:**




ప్రతి ఆడపిల్లకు చదువే ఒక శక్తివంతమైన ఆయుధం కావాలని, విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు పి.ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 'లాస్ట్ రివిజన్ బుక్' స్టడీ మెటీరియల్‌ను డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు గొప్ప కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో, ఇష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్రస్థాయి విషయ నిపుణులతో నాణ్యమైన మెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు ధనికుడు కాకపోయినా, ఎటువంటి ఉద్యోగం లేకపోయినా.. కేవలం తన ఆశయమే లక్ష్యంగా నల్లగొండ, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో వేలాది మంది విద్యార్థులకు తోడ్పాటునందించడం గర్వకారణమని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ విజయశ్రీ, అఖిల భారత విద్యార్థి సమైక్య మాజీ జిల్లా అధ్యక్షులు నలపరాజు సతీష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైజ్ఞానిక వృత్తి విద్య యాత్ర



**గరిడేపల్లి,మార్చి 04,మన సాక్షి:**

గరిడేపల్లి పరిధిలోనే పీఎం శ్రీ గడ్డిపల్లిమోడల్ స్కూల్–వైజ్ఞానిక మరియు వృత్తి విద్య యాత్ర.పీఎం శ్రీ గడ్డిపల్లిమోడల్ స్కూల్–వైజ్ఞానిక మరియు వృత్తి విద్య యాత్రలో భాగంగా గోల్కొండ కోట మరియు నెహ్రూ జూలాజికల్ పార్కుతో పాటు, స్వామి రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్ భూదాన్ పోచంపల్లి సందర్శించడం జరిగింది. అలాగే వృత్తి విద్యలో భాగంగా భూదాన్ పోచంపల్లి లో ఉన్న స్వామి రామానంద తీర్థ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి తొమ్మిదో తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు ఐ.టీ వల్ల విద్యార్థులకు ఎలాంటి జీవనోపాధి సౌకర్యాలు కలుగుతాయో, ఐటీ వల్ల జీవన వికాసం ఎలా మెరుగవుతుందో" డాక్టర్ వసంత కుమారి" వివరించారు. చారిత్రక జీవవైవిధ్య,వృత్తి విద్యల వల్ల విద్యార్థుల మానసిక మరియు జీవన నైపుణ్యాలు మెరుగుపడతాయని ప్రిన్సిపల్ "డాక్టర్ జె ప్రసన్న కుమారి" వివరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సతీష్, శైలజ, డాక్టర్ కందుల శివకృష్ణ,డాక్టర్ బి శ్రావణ్, చిన్న బాలయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్, దామ్లా, శాంతి ప్రియ, మల్లికార్జున్ రెడ్డి, రమేష్,శ్రీను సంధ్య, అనిల్, ప్రమీల మొదలగు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న జాతర పనులు



**చింతపల్లి,మార్చ్ 04,మన సాక్షి:**

చింతపల్లి మండల పరిధిలోని తేదేడు గ్రామంలో శ్రీ శ్రీశ్రీ భవాని రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఈ నెల 1నుండి ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా గురువారం సాయంకాలం గుట్టపై స్వామివారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరపనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తుల రాక సందర్భంగా తేదేడు ఎక్స్ రోడ్డు నుండి గుట్ట వరకు స్థానిక సర్పంచ్ ఉల్పాల స్వప్న శేఖర్ రెడ్డ రోడ్డుకు ఇరువైపులా జెసిబి తో రహదారిని బాగు చేస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి, సురభి సత్యనారాయణ శర్మ, గ్రామ పెద్దలు,ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన హోలీ సంబురాలు



**కంగ్టి, మార్చి 04, మన సాక్షి:**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల తడ్కల్ గ్రామంలో బుధవారం హోలీ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. చిన్న పెద్ద లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. సంతోషంగా జరుపుకున్నారు. మంగళవారం గ్రహణం ఉన్న సందర్భంగా బుధవారం హోలీ పండుగ జరుపుకుంటున్నారు. గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ సందడి చేశారు. యువకులు రోడ్లపైకి వచ్చి రంగులు చల్లుకుంటూ ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

**గరిడేపల్లి,మార్చి 04,మన సాక్షి:**



గరిడేపల్లి మండలం రేగుల గడ్డ తండా గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు అనుబంధం) గరిడేపల్లి మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుడు మోటార్ సైకిల్ ప్రమాదం లేదా ఇతర ప్రమాదంలో మరణించినా, రూ:10 లక్షల ప్రమాద బీమా ఇవ్వడానికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి చేయడం సరైన పద్ధతి కాదని విన్నవించుకుంటున్నాం.భవన నిర్మాణ కార్మికులకు కూలీ పని చేసే వాళ్లకు కానీ ఇటుక బట్టిలోఇటుకలు తయారు చేసే వాళ్లకు కానీ డ్రైవింగ్ లైసెన్సులు ఉండవు భవన నిర్మాణ పనులు చేసే వాళ్ళు ఎక్కువమంది నిరక్షరాశులై ఉంటారు వారికి డ్రైవింగ్ లైసెన్సులు ఉండవు ఇది గమనించి ప్రభుత్వం నిబంధనలను తొలగించాలని మనవి చేసుకుంటున్నాం కార్మికుడు ప్రయాణిస్తున్న వాహనం తనది కాకపోయినా లైసెన్సు లేకపోయినా ప్రమాదం వల్ల మరణిస్తే ఆ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేస్య ప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమం లో నీలమ్మ. వీరమ్మ. శాంతి. సాలమ్మ. వీర కుమారి తదితరులు పాల్గొన్నారు.

## తీదేడులో బ్రహ్మోత్సవాలు... ప్రారంభమైన అభిషేకాలు..!

**చింతపల్లి,మార్చి 04,మన సాక్షి:**



చింతపల్లి మండల పరిధిలోని తీదేడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం భక్తులుగుట్ట పై స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరిన కోరికలు తీర్చే దైవంగా భావిస్తూ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టడం జరుగుతుందని భక్తుల పేర్కొంటున్నారు...శివుడు ఐశ్వర్య కారకుడు ఎన్నో ఆటంకాలు తొలగించి సంతోషాన్ని ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడని తెలిపారు. సత్యనారాయణ స్వామి వ్రతాలతో , పాటు గండదీపాలు గండ దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉల్పాల స్వప్న శేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ,ధరణిపతి రమణారావు, మాజీ పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, ఆలయ పురోహితులు సురభి ప్రభాకర్ శర్మ,గ్రామస్తులు సిమర్ల శ్రీను యాదవ్,మద్రు పవన్ కుమార్,రెడ్డి పరమేష్ ముదిరాజ్, ఉడుత శంకరయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**నల్లగొండ,మార్చి 04,మన సాక్షి:**



వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 104 ఏ సీనియర్ సిటిజన్ కపుల్స్ నల్గొండ వారి ఆధ్వర్యంలో వనమా లక్ష్మయ్య విజయల సహకారంతో బుధవారం స్థానిక దేవరకొండ రోడ్డులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వీరెల్లి సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్రార్ధన పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉన్నత చదువులు చదవాలని కోరారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సింగిరికొండ గోవర్ధన్, కార్యదర్శి మురారిశెట్టి కృష్ణయ్య, కోశాధికారి గజవెల్లి యాదయ్య, జిల్లా గవర్నర్ వీరెల్లి సతీష్ కుమార్, జిల్లా కార్యదర్శి నూనె కిషోర్ కుమార్, అదనపు కార్యదర్శి తేలుకుంట్ల వీరయ్య, జోన్ చైర్మన్ బికుమల్ల రవీందర్, ఇతర క్లబ్ సభ్యులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ యూసుఫుద్దీన్, ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాన్షిరాం జయంతి..భారీ బహిరంగ సభ

**నాచారం,మార్చి 04,మన సాక్షి:**



బీఎస్పీ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరాం జయంతి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసున్నామని బీఎస్పీ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షుడు మింద్రాల నర్సింగ్ రావు తెలిపారు. బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కాన్సిరాం 92 వ జయంతి పురస్కరించుకొని బడంగ్ పేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 15న జరిగే సభను విజయవంతం చేసే విధంగా జిల్లా నాయకులకు రాష్ట్ర అధ్యక్షుడు బాధ్యతలు అప్పగించినట్లు నర్సింగరావు తెలిపారు.

## శ్రీవారికి అష్టోత్తర శతకలశాభిషేకం

**రాజన్న సిరిసిల్ల,మార్చి 02,మన సాక్షి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండల పరిధిలోని గూడెం శ్రీ ఆండాళ్, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, 108 కళాశాలతో అభిషేకం. అనంతరం సుదర్శన హవనము, సాయంత్రం ఎదుర్కోళ్ళ ఉత్సవము జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ శాశ్వత చైర్మన్ సి హెచ్ వెంకటేశ్వరరావు, ఆలయ అధ్యక్షులు బి బాలమల్లు, ప్రధాన కార్యదర్శి టి రావు లు మాట్లాడుతూ గురువారం ఉదయం 10:30 కు శ్రీ ఆండాళ్, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవమును అత్యంత వైభవంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాటు చేశాము, కావున పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ అంజన్ రావు, సి హెచ్ రమాపతిరావు, బి రాజేశ్వరరావు, ఆలయ అర్చకులు, పాలక మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

**మేళ్లచెరువు, మార్చి 04,మన సాక్షి:**




మేళ్లచెరువు మండల కేంద్రంలోని మహా సిమెంట్ పరిశ్రమలో జాతీయ భద్రతా వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. 55వ జాతీయ భద్రత జెండాను యూనిట్ హెడ్ నందనమూడి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరిశ్రమ సిబ్బంది,కార్మికులు భద్రత ర్యాలీ నిర్వహించారు. జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో నిర్వహించిన భద్రత పద్యాల పోటీల్లో ఆంగ్లంలో మొదటి బహుమతి, హిందీలో మూడో బహుమతి పరిశ్రమ సిబ్బంది గెలుచుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ బహుమతులను హైదరాబాదులోని రవీంద్ర భారతి లో జరిగిన జాతీయ భద్రతా ప్రారంభోత్సవ వేడుకలలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆ శాఖ చీఫ్ సెక్రటరీ దానం కిషోర్ ,పరిశ్రమల శాఖ డైరక్టర్ మోహన్ బాబు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. బహుమతి గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. "భద్రతను మెరుగుపరచడానికి, అందరినీ భాగస్వామ్యం చేయండి, అవగాహన కల్పించండి సాధికారత చేయండి" అనే నినాదంతో ముందుకు వెళ్లాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రతాధికారులు, సిబ్బంది మరియు కార్మికులు పాల్గొన్నారు.

## తురక కాశల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించండి..!

### హరీశ్ రావుకు వినతి

**సంస్థాన్ నారాయణపురం,మార్చి 04,మన సాక్షి:**



రానున్న అసెంబ్లీ సమావేశంలో తురక కాశ సమస్యలపై గళం విప్పాలని తురక కాశ నాయకులు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హరీష్ రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. తురక కాశ రాష్ట్ర అధ్యక్షులు షేక్ బడే సాబ్ మాట్లాడుతూ తురక కాశలు బండల కింద చితికి పోతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని, తమను గుర్తించి తమ అభివృద్ధికి కృషి చేయాలని, సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా అసెంబ్లీలో తమ గురించి మట్లాడాలని కోరారు. హరీష్ రావు మాట్లాడుతూ అసెంబ్లీలో తప్పకుండా ప్రస్తావిస్తానని,తురక కాశల అభివృద్ధి గురించి కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్,లీగల్ సెల్ అడ్వైజర్ యామిన్ భాషా, ఉపాధ్యక్షులు షాదుల్లా,వలీ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గౌస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు షేక్ మౌలాన, నాయకులు అబ్దుల్ కరీం, గౌస్, రషీద్, హైదర్, ఖధార్, అలీ, ఖాసీం, రుక్మద్దీన్, కరీం, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**నల్లగొండ, మార్చి 04,మన సాక్షి:**

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆమేర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మిర్యాలగూడ రోడ్ లో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా బషీర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందూ ముస్లింలు సోదర భావంతో ఎలాంటి సంఘవిద్రోహశక్తులకు తావివ్వకుండా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ. హఫీజ్ ఖాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు నదీమ్, హాజీ, ఎంఐఎం నాయకుడు మోయిన్, మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, ప్రకాశం బజార్ వ్యాపారస్తులు ఇడుకుల నరసింహ, ఆంజనేయులు, శ్యామ్, నవీన్, వనమా అశోక్, అంజద్, నసీర్, మూవీస్, ఇసాక్, రియాజ్, అజ్జు, యూనుస్, ముసురఫ్, ఫర్హాన్, సైఫ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముక్కంటేశ్వర తిరునాళ్ళు

**రామసముద్రం,మార్చి 04,మన సాక్షి:**



రామసముద్రం మండలం ఊలపాడు గ్రామ పంచాయతీ నరసాపురం గ్రామంలో బుధవారం శ్రీ ముక్కంటేశ్వర స్వామి తిరుణాలు అత్యంత వైభవంగా జరిగింది. గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణ, పచ్చని తోరణాలతో ముస్తాబు చేశారు. ఆలయాన్ని బెంగళూరు నుండి పలు రకాల పుష్పాలతో అలంకరించి స్వామి వారికి అభిషేఖాలు, అర్చనలు నిర్వహించి వేకువ జామున పురోహితులు (అర్చకులు అనిల్ స్వామి) అర్చకులుబృందంచే వేద మంత్రాలతో స్వామి వారిని కల్యాణ మండపం లో ఆశీనులు చేసి నరసాపురం గ్రామస్థులు చేతికి కంకణాలు కట్టుకుని తలంబ్రాలు చేతబట్టి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారి కళ్యాణం గ్రామస్థులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.రాత్రి స్వామి వారిని పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి న రథంపై ఆశీణులు చేసి పురవీధుల్లో ఊరేగించారు.

స్వామి ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా పక్క గ్రామం నుండి మేళవాయిద్యాలు నడుమ గ్రామానికి రావడం తో నరసాపురం గ్రామస్థులు వారికి పూలమాలలు వేసి గ్రామానికి స్వాగతం పలికారు, సాంస్కృతిలో భాగంగా కీలు గుర్రాలు, చెక్కభజనలు, కోలాటాలు,గారడీ బొమ్మలు మధ్యన స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది.

ఈ వేడుకలను తిలకించిడానికి మండలం నుంచి కాక ఇతర జిల్లా, ఇతర రాష్టాలు నుండి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు భక్తులకు అన్న దానం నిర్వహించారు. స్వామి వారిని ప్రముఖ రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపార వేత్తలు ప్రజలు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

# గజవాహనం పై పురవీధులలో విహరించిన స్వామి వారు..!

**రామసముద్రం,మార్చి 04,మన సాక్షి:**



మండలంలోని చంబకూరు గ్రామపంచాయతీలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని పలు రకాల పుష్పాలతో అర్చకులు కార్యనిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాలతో డప్పు వాయిద్యాల మధ్య బాణ సంచాలు కాలుస్తూ ఘనంగా పురవీధులలో ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డి వంశస్థులు నిర్వహించడం ఆనవాయితీ.

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**హాలియా,మార్చి 04,మన సాక్షి:**

పదో తరగతిలో ప్రభుత్వశీ నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ అమలుపరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని అనుముల మండల విద్యాధికారి శ్రీనయ్య పేర్కొన్నారు. బుధవారం పులిమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల ఇంటర్నల్ మార్క్స్ రికార్డ్స్ పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది ఫలితాల్లో అనుముల మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉదయం ,సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రికార్డు పరిశీలనలో జిహెచ్ఎంలు శేషు, శైలజ ఉపాధ్యాయులు అంజయ్య, రమేష్ స్థానిక ఉపాధ్యాయులు నరసింహా చారి, రవీంద్ర చారి, కొల్లు శ్రీనివాస్ రెడ్డి , రవీందర్ ఉమా రెడ్డి సంధ్య ,వినోద తదితరులు ఉన్నారు.

## కల్యాణ లక్ష్మి,షాదిముబారక్ చెక్కులు పంపిణీ

**శేరిలింగంపల్లి, మార్చి 04,మన సాక్షి:**



పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హాఫీజ్పేట్, చందానగర్ ,భారతి నగర్ డివిజన్లకు సంబంధించిన కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకం ద్వారా మంజూరైన 40 మంది లబ్ధిదారులకు రూ. 40,04,640/- నలభై లక్షల నాలుగు వేల ఆరు వందల నలభై రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డిలతో కలిసి చెక్కుల పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడు తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుపేదల ఆడ బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,మహిళ సోదరీమణులు లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులదే కీలక పాత్ర

### ఎంపిడిఓ సత్తయ్య

**కంగ్టి, మార్చి,04, మన సాక్షి :**




గ్రామాల్లో సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా వార్డు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో సత్తయ్య, ఎంపీఓ లక్ష్మణ్ సూచించారు. మండల కేంద్రమైన కంగ్టి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని భీమ్రా, భోర్గి, చౌకన్ పల్లి , చందర్ తండా, చాప్టా బీ,చాప్టా కే,దామరగిద్ద ( పీఎం )దెగుల్ వాడి ,ఎన్నెమురి , గాజుల పాడ్,10 గ్రామ పంచాయతీల సంబంధించిన 94 మంది వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. గ్రామపంచాయతీ పాలన, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు విజయ్ కుమార్, అనిల్ కుమార్, వినయ్ కుమార్, జనార్దన్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**మేడ్చల్ మల్కాజిగిరి,మార్చి 04, మన సాక్షి:**



మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్ బాగ్ దేవాదాయ ధర్మా దాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవోపేతముగా ప్రారంభమయ్యాయి. అందు లో భాగంగా ఉదయం గణపతి పూజా, పుణ్యాహావాచన, మండపారాధన, ధ్వజారోహణము, శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్య, శ్రీ సరస్వతి హోమము లు ఆలయ అర్చకులు మాడుగుల రాజశేఖర్ శర్మ, గురురాజ్, సాయికుమార్ లు నిర్వహించారు. 22వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, దేవాలయానికి దర్శనానికి విచ్చేశారు. వారికి స్వాగతం పలికి శాలువాతో సత్కరించి ఆలయ ఈఓ ఏబి రవీందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు బుధ, గురు రెండు రోజులు వైభవంగా జరగనున్నాయి. కావున పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణం

**సూర్యాపేట రూరల్,04 మన సాక్షి:**



సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని 10వార్డు కుప్పిరెడ్డిగూడెంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవాలయంలో గోపయ్య సమేత శ్రీ లక్ష్మి తిరుపతమ్మ కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. లక్ష్మి తిరుపతమ్మ గోపయ్యల కల్యాణం అత్యంత అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రత్యేక వేదికలపై ఉత్సవ విగ్రహాలతో వేదమంత్రాల నడుమ,వేలాది మంది భక్తుల సమక్షంలో ఈ కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని ఆ తల్లిని ప్రత్యేకంగా ప్రార్థించారు. శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య అనుగ్రహం ప్రతి ఇంట్లో వెల్లివిరియాలని, అందరూ సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎంకటి శేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు చెత్త రిక్షాలు, ప్లాస్టిక్ డబ్బాలు అందజేత



**రామసముద్రం, మార్చి 04,మన సాక్షి:**

రామసముద్రం మండలంలోని గ్రామ పంచాయతీలకు బుధవారం మండల అధికారులు15 చెత్త రిక్షాలను, తడి పొడి వ్యర్థాల కోసం ప్లాస్టిక్ డబ్బాలను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా మార్చుటానికి స్వచ్ఛ భారత్ మిషన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఈ చెత్త రిక్షాలను, ప్లాస్టిక్ డబ్బాలను అందజేశాయని తెలిపారు. వీటి ద్వారా ప్రాథమిక వ్యర్థాలను సంపద తయారీ కేంద్రాలకు తరలించడానికి పారిశుధ్య కార్మికులకు ఉపయోగపడతాయని, కాలుష్య రహితంగా ఉంటాయని తెలిపారు. ఆకుపచ్చ రంగు డబ్బాలో తడి చెత్తను,నీలి రంగు డబ్బాలో పొడి చెత్తను వేరు వేయడానికి వీలుగా ఆకుపచ్చ, నీలి రంగులను సూచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి గఫూర్, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మహిళా డప్పుల బృందానికి ప్రథమ బహుమతి

**గరిడేపల్లి,మార్చి 04,మన సాక్షి:**



నల్గొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలల్లో భాగంగా నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి డప్పుల పోటీలో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం అద్భుతమైన డప్పుల ప్రదర్శన కనబరిచి మొదటి బహుమతిని సొంతం చేసుకున్నారు. పోటీల అనంతరం దేవాలయ కమిటీ చైర్మన్ విద్యాసాగర్ రావు, కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహుమతినీ అందుకున్నారు. ముఖ్య అతిథులుగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ గ్రామ సర్పంచ్ పిల్లల సందీప్ గ్రామ పెద్దలు యువకులు మహిళలు పోటీలను చూడడానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందాన్ని కవులు కళాకారులూ, రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

## వరద నీటి కాలువ నీటి పనులు పరిశీలన



**శేరిలింగంపల్లి, మార్చి 04,మన సాక్షి:**

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కాల్వ నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హఫీజ్పేట్ డివిజన్ పరిధిలో బచ్చుకుంట చెరువు అలుగు నుండి జాతీయ రహదారి ఎన్. హెచ్ -65 వరకు రూ. 1 కోటి 92 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న వరద నీటి కాల్వ పనులను ఎమ్మెల్యే గాంధీ బుధవారం జిహెచ్ఎంసి ఇంజినీరింగ్ అధికారులు,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో వరద నీరు కాలనీలను ముంచెత్తడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కాల్వ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో వరద సమస్య పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యంగా మురళీధర్ సొసైటీ కాలనీకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనులు నిర్వహించాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన పనుల వేగం పెంచి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఏ సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ శ్రీదేవి, నాయకులు మూర్తి , స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



**తుర్కపల్లి ,మార్చి 04,మన సాక్షి:**

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై ఒక్కరోజు విధులను నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, పంచాయతీ కార్యదర్శి దార మహేందర్ ,వార్డు సభ్యులు నారా నాగరాజు , కొడపాక మహేష్, పల్లెపాటి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు రజిత , విద్యార్థులు పాల్గొన్నారు...

## భద్రకాళి అమ్మవారికి వెండి వడ్డానం,కన్నులు బహుకరణ

**వేములపల్లి, మార్చి 04, మన సాక్షి:**



మనసుంటే మార్గం ఉంటుందని, పుట్టిపెరిగిన ఊరిలో భక్తులు కోరిన కోరికను తీర్చి భద్రకాళి అమ్మవారికి ఆమనగల్లు గ్రామానికి చెందిన ఉత్తర్ల సైదులు -మౌనిక వెండి వడ్డానం,కన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాడి పంటలు సమృద్ధిగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా చల్లని దీవెనలు గ్రామ ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. దీంతో దేవాలయ ఇంచార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రి అర్చకులు రెంటాల సతీష్ శర్మ వారిని శాలువతో సన్మానించి అభినందించారు.

# వెలుగుమట్ల బాధితులకు పక్కా భవనాలను నిర్మించి ఇవ్వాలి

## - జిల్లా కలెక్టర్ కు డాక్టర్ విశారదన్ మహరాజ్ వినతి

**ఖమ్మం, మార్చి 04,మన సాక్షి:**



ఖమ్మం, బీసీ ఎస్సి ఎస్టి జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వెలుగుమట్ల భూదాన భూమి బాధితుల సమస్యలపై పలు డిమాండ్ల మీద వినతి పత్రాన్ని అందజేశారు . వెలుగుమట్లలోని 147 , 148 , 149 సర్వే నెంబర్లలోని భూదాన్ ట్రస్ట్ 62 ఎకరాలలో ఉన్న ఇండ్లు కూల్చబడి నిరాశ్రయులైన ప్రజలకు మరియు ఇండ్లు లేని ఇతర పేదలకు అక్కడే పక్కా భవనాలను నిర్మించి ఇవ్వాలి , భూదాన్ ట్రస్ట్ వారి 62 ఎకరాల భూమి ఉండగా కేవలం 31 ఎకరాలను మాత్రమే నిర్ధారించటం పై వివరణ ఇవ్వాలి బాధితులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా ఇండ్లను కూల్చడం అప్రజాస్వామికము దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి ఈ సమస్య పరిష్కారం అయ్యేవరకు బాధితులందరికీ సరైన పునరావాసకేంద్రలలో పౌష్టికరమైన భోజన ఏర్పాట్లు , వైద్య సౌకర్యం , విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించగలరు , బయో టాయిలెట్స్ ఏర్పాట్లు మరియు పరిసరాల పరిశుభ్రతపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పోడకంటి రాంబాబు , జిల్లా కన్వీనర్ ములకలపల్లి సంగమేశ్వరావు , కో కన్వీనర్ కొర్లపాటి రాఘవులు , కటకం వెంకటలక్ష్మి , జిల్లా కమిటీ మెంబర్ అనిక నాగేశ్వరరావు యాదవ్ , నర్ల శేషయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు .

# మహిళలకు ఆటల పోటీల నిర్వహణ

**మందమర్రి,రూరల్,మార్చి 04,మన సాక్షి:**



ఈనెల ఆరవ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మందమర్రి పట్టణ మరియు పరిసర ప్రాంతాల మహిళలకు సి.ఈ.ఆర్ క్లబ్ లో ఉదయం 10 గంటలకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని మందమర్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని సదుద్దేశంతో సింగరేణి యాజమాన్యం మహిళలకు టైలరింగ్ అల్లికలు మగ్గం వర్క్ లాంటి ఎన్నో రకాల శిక్షణాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే అనారోగ్యాలు రాకుండా సింగరేణి కార్మికుల కుటుంబీకులకు యోగా నేర్పించడం కూడా జరుగుతుందన్నారు. అందులో భాగంగానే మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు త్రో బాల్. బాంబింగ్ బ్లాస్ట్ .గ్రూపుల వారీగా డాన్సుల పోటీలను నిర్వహించడం జరుగుతుందని మహిళామణులు అందరూ పాల్గొనాలని తెలిపారు ఇందులో గెలుపొందిన వారికి 8వ తేదీ ఆదివారం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇల్లందు క్లబ్బు ప్రాంగణంలో బహుమతుల ప్రధానం జరుగుతుందని తెలియజేసారు

# ప్రజాపాలనలో పేదోడి కల సాకారం

## మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి

**నారాయణపేట టౌన్, మార్చి 04, మన సాక్షి:**



కాంగ్రెస్ ప్రజా పాలనలో పేదోడి సొంతింటి కల నెరవేరుతున్నదని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డిఅన్నారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట మండలంలోనీ వందర్ గుట్ట తండా, బండ గొండ గ్రామం లో ఇందిరమ్మ ఇళ్లను మార్కె ట్ చైర్మన్ శివారెడ్డి ప్రారంబిం చారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయ కుడు చిట్టెం మాధవ రెడ్డి నాయకులు జనార్ధన్ గౌడ్, ఎండి గౌస్ మాజీ . కృష్ణ నాయక్, శ్రీను నాయక్ ,సుదర్శన్ గౌడ్. సాయి రెడ్డి. యాదయ్య. కృష్ణ నాయక్. బాలు నాయక్. రాములు నాయక్. హనుమమ్మ. శ్రీను నాయక్. చందర్ నాయక్ బండ గుండ సర్పంచు రామచందర్,అంజలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవల పై ఆరా..!



**ఆర్మూర్, మార్చి 04,మన సాక్షి:**

ఆలూర్ మండలం కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుత్ప సబ్ సెంటర్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నపిల్లలకు వేస్తున్న టీకాలు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆమె ఆరా తీశారు. టీకాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిస్టర్స్,ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం అయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సబ్ సెంటర్‌లోని అన్ని రిజిస్టర్లను పరిశీలించి, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ తగిన మార్గదర్శకాలను అందించారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

**వెల్దండ,మార్చి 04ఓమన సాక్షి:**



యూరియా కంపెనీలో కొత్తగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రంలోని హైదరాబాద్– శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం సింగిల్ విండో కి 700 బస్తాల యూరియా వచ్చినట్లు తెలుసుకున్న రైతులు ఉదయాన్నే అక్కడకు చేరుకొని ఆన్లైన్లో బుకింగ్ చేద్దామను యూరియా బుకింగ్ కావడం లేదని, క్షణాల్లో యూరియా బస్తాలు అయిపోయాయాయని రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు తమ వద్ద స్మార్ట్ ఫోన్లు కూడా లేవని, తమకు బుకింగ్ చేసే విధానం కూడా తెలవదని పాత పద్ధతి ద్వారానే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ వ్యక్తం చేశారు. దీంతో సమాచారం అందుకున్న మండల వ్యవసాయ అధికారిని శోభారాణి, ఎస్సై కురుమూర్తి ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య, రైతులు వినోద్ రెడ్డి, తెలుగమల అంజయ్య, సిల్వేరు సత్తయ్య గౌడ్,చిలికేశ్వరం లక్ష్మయ్య, సత్తూరి బాల్ లింగం, చక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు కీలకం

**ఖమ్మం, మార్చి 04,మన సాక్షి:**




డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు చాలా కీలకమైనదని, కంటి చూపు బాగుంటేనే వాహనాన్ని సమర్థవంతంగా నడపగలుగు తారని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కొనసాగుతున్న అరైవ్ అలైవ్ రెండో విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా..ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలోని ఎంటీఆర్ సర్కిల్ హైవే లో వెళ్తున్న భారీ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతలో పాటించాల్సిన నియమాలపై సమగ్రంగా వివరించారు. ఈ శిబిరం ద్వారా 110 మందికి పైగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు. వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, క్రమం తప్పకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. చాలా మంది డ్రైవర్లు కంటి చూపును అశ్రద్ధ చేస్తున్నారనే ఉద్దేశంతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు,ట్రాక్టర్లు పట్టివేత..!

**మిర్యాలగూడ, మార్చి 04,మన సాక్షి :**



ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు,రెండు ట్రాక్టర్లను మిర్యాలగూడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఆలగడప టోల్గేట్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు నేరేడుచర్ల వైపు నుండి మిర్యాలగూడ వైపు అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు వచ్చాయి. అనుమతి పత్రాలు అడిగినప్పటికీ వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్ వాహనాల యజమానులు, డ్రైవర్ల మీద కేసు నమోదు చేసి టిప్పర్లను స్టేషన్ కు తరలించారు. అదేవిధంగా కాల్వపల్లి వైపు నుంచి మిర్యాలగూడ వైపు అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసులు నమోదు చేశారు. మిర్యాలగూడ మండలం పరిధిలో అక్రమంగా మట్టి ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.

# ఉల్లాసంగా జడ్జిలు,న్యాయవాదుల హోలీ సంబరాలు



**నారాయణపేట టౌన్, మార్చి 04, మన సాక్షి:**

నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా కోర్టు న్యాయమూర్తులు,న్యాయవాదులు హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు,సీనియర్ సివిల్ జడ్జి వింద్యానాయక్ , ఎ డీజే లకు శుభాకాంక్షలు తెలిపి రంగులు పోశారు. అలాగే జడ్జిలు న్యాయవాదులకు ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయవాదులు నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకుని మిఠాయిలు పంచుకొన్నారు. అందరి జీవి తాల్లో వసంతం రావాలని ఆకాంక్షించారు. ఈ ఉత్సవాలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులంతా ఉత్సా హంగా పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆలూర్ వాసి ఆండ్రాసి మల్లయ్య మృతి..!

**ఆర్మూర్,మార్చి 04,మన సాక్షి:**



ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఒక కార్మికుడు రోడ్డు ప్రమాదంలో బలైపోయాడు. నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రానికి చెందిన ఆండ్రాసి మల్లయ్య మంగళవారం సాయంత్రం మస్కట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మరణించారు. మల్లయ్య రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన ఒక కారు ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్ర ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం విదేశానికి వెళ్లిన యజమాని తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. మల్లయ్య మరణవార్త విన్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని మస్కట్ నుండి తమ స్వగ్రామమైన ఆలూర్‌కు వీలైనంత త్వరగా చేర్చేలా చూడాలని బాధిత కుటుంబ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులను వేడుకుంటున్నారు. మృతదేహం తరలింపునకు అవసరమైన ఏర్పాట్లు చేసి, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

**నారాయణపేట టౌన్, మార్చి 04, మన సాక్షి:**



నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ పంచాయితీ సర్పంచ్ పి.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా బుధవారం ప్రభుత్వ పాఠశాల, గ్రామంలోని వివిధ వార్డులలో నెలకొన్న నీటి సమస్యను తీర్చుటకై గ్రామ సర్పంచ్ పోలీస్ వెంకటరెడ్డితో పాటు వార్డు మెంబర్లు రాజమూర్ అంజి,జుట్టు బాలకిష్టప్ప,బల్ల అనిల్ గ్రామంలో పాడైపో యిన చేతిపంపులు, మోటార్ల ను మరమ్మతు చేయించారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాల లో ఉన్నటువంటి చేతిపంపు బోరు పాడవడం వల్ల అక్కడు న్న విద్యార్థులకు నీళ్ల ఇబ్బం ది ఉండడంవల్ల బోరు బాగు చేయించి సమస్య పరిష్కరించారు. ముఖ్యంగా గత కొన్ని నెలల నుండి ఏడవ వార్డులో నీటి సమస్య ప్రధానంగా ఉండడం వలన వార్డు మెంబర్ రాజమూరు అంజి గ్రామ సర్పంచ్ పోలీస్ వెంకట్ రెడ్డి కృషితో నూతన కనెక్షన్ ఇప్పించి నేటి సరఫరా అయ్యేటట్టు చేయడం జరిగింది. ఉపసర్పంచ్ బొంబాయి అంజిలమ్మ హనుమంతు,వార్డు సభ్యులు రాజమూర్ అంజి, జుట్టు బాలకిష్టప్ప, బల్ల అనిల్ తదితరులు ఉన్నారు.

# నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీలు

**శివంపేట,మార్చి 04,మన సాక్షి:**



శివంపేట మండలంలోని ఆ గ్రామాలకు చెందిన నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు శివంపేట ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. శివంపేట మండలంలోని పెద్ద గొట్టిముక్కల పంచాయతీ కార్యదర్శి నసీమా భాను. తాళ్లపల్లి తండా పంచాయతీ కార్యదర్శి సుమిత్ర భాయ్. బిఖ్యా తాండ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్. రూపుల తండా పంచాయతీ కార్యదర్శి అభిలాష్. లు బదిలీ అయినట్లు శివంపేట ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ చెప్పారు. సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి. సిబ్బంది తదితరులు ఉన్నారు

# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**శివంపేట,మార్చి 04,మన సాక్షి:**

గ్రామాల అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తోని సాధ్యమవుతుందని గ్రామ సర్పంచ్ చింతల విజయ వెంకటరామిరెడ్డి అన్నారు శివంపేట మండలంలోని కొంతనపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధులతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు గ్రామాలను అభివృద్ధి పథకంలో నడిపించడానికి అందరి సహకారంతో కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ చింతల విజయ వెంకటరామిరెడ్డి చెప్పారు అందరూ పార్టీలకు అతీతంగా సహకరిస్తే గ్రామాలు అభివృద్ధి పథకం నడిపించడానికి తన వంతు కృషి ఎప్పుడు ఉంటుందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు ఈ కార్యక్రమం లో మాజీ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి పంచాయతీ సభ్యులు ఉప సర్పంచ్ కుమార్ సంతోష్ గూడా అంజమ్మ సంతోష్ కుమార్ గొల్ల కవిత నాగరాణి రమేష్ పంచాయతీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో నీటి సమస్య పరిష్కారానికి పాటుపడాలి

## - ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ




**శివంపేట,మార్చి 04,మన సాక్షి:**

గ్రామాల్లోనూ వేసవిని దృష్టి పెట్టుకొని నీటి సమస్య కోసం అందరూ పరిష్కారానికి మార్గాన్ని కనుక్కోవలసిన అవసరం ఉన్నదని శివంపేట ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ అన్నారు.మండల కేంద్రమైన శివంపేట ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ వార్ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో వారి ఉద్దేశించి మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించడానికి అందరూ కలిసికట్టుగా ఉండి ప్రజలకు తాగునీరు అందించాలని ఆమె అన్నారు. పంచాయతీ సభ్యులు విధులు బాధ్యతలు. చట్టాల పట్ల చక్కటి అవగాహన చేసుకోవాల్సింది అవసరం ఉన్నదని అన్నారు.వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కారానికి పరిష్కరించడానికి ప్రయత్నం చేసి వారికి ప్రజలకు నీటిని అందించాలి ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సభ్యుల శిక్షకులు శంకర్ గౌడ్ ప్రభాకర్ రెడ్డి లక్ష్మణ్ శ్రీధర్. ఆయా గ్రామ పంచాయతీల సభ్యులు దొంతి చెన్నాపూర్. పెద్ద గొట్టిముకుల గంగాయిపల్లి. పాంబండ బిజిలి పూర్ గోమారం. పిలుట్ల. రెడ్డియాతాండ. తాళాపల్లి తండా. రూపుల తండా. శభాష్ పల్లి. సెకండ్లాపూర్. నాగరోలా ఆంజనేయులు. నీరుడు శ్రీకాంత్ దుబ్బా బాలమణి సత్యనారాయణ కుమ్మరి యాదమ్మ ఎర్ర శ్రీనివాస్.. ఏపీవో అనిల్ కుమార్. పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు

# మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**నారాయణపేట టౌన్, మార్చి 04, మన సాక్షి:**

జిల్లాలో మైనర్‌లు వాహనాలు నడపడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీ కృష్ణ చైతన్య హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదా లు జరుగుతాయని, మైనర్లు వాహనాలు నడుపుతూ ట్రిబుల్ రైడింగ్ నేపథ్యంలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండక ముందే ద్విచక్ర వాహనాలు లేదా నాలుగు చక్రాల వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. మైనర్‌లు వాహనా లు నడిపితే కేవలం వారిపైనే కాకుండా తల్లిదండ్రులు, వాహన యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.జిల్లాలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి తనిఖీలు చేపడతామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య స్పష్టం చేశారు.

# శ్రీముక్కంటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**రామసముద్రం, మార్చి 04,మన సాక్షి:**

రామసముద్రం మండలం ఊలపాడు గ్రామపంచాయతీ, నర్సాపురం గ్రామంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నటువంటి శ్రీ ముక్కంటేశ్వర స్వామి తిరునాళ్లలో భాగంగా వైసీపీ నాయకుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం తిరునాళ్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి నాయకులు ఘనంగా ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్..!



**నడిగూడెం, మార్చి 04,మన సాక్షి :**

మండల పరిధిలోని చెన్నకేశపురం గ్రామ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ పరిశీలించారు. అంగన్వాడీ సెంటర్లో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు అందించే పాలు గుడ్లు పౌష్టికాహారం పట్ల ఆరా తీశారు. గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ కేంద్రంలో సదుపాయాలు కల్పించాలని అన్నారు. అనంతరం అంగన్వాడీ పిల్లలు, గర్భిణీ స్త్రీల తో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పప్పుల భాగ్యమ్మ, అంగన్వాడి పిల్లలు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# దాతల సేవలు అభినందనీయం

**ధర్మారం, మార్చి 04,మన సాక్షి:**




ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామంలో దాతల సేవలు అభినందనీయమనీ పత్తిపాక కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఖండేరావు పరీక్షిత్ నరేందర్ రావు అన్నారు. బుధవారం రోజున పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో ఇదే గ్రామానికి చెందిన ప్రముఖ ప్రజాప్రతినిధి ఆకుల రాజేందర్, తొంబై ఏడు మంది విద్యార్థులకు ఇరవై వేల రూపాయల విలువైన షూలను బహుకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరేందర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని గ్రహించి విద్యార్థులందరికి ఇరవై వేల రూపాయలతో షూలు అందించటం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతి కొరకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లన్న, ఉపాధ్యాయులు గండ్రాతి శ్రీలత, అనుమల్ల శారద, సిరిపురం సునిల్, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ఎదుల్ల ప్రేమ్ సాగర్,అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్ పర్సన్ ఏలేటి పద్మ,అంగన్వాడీ టీచర్ వినోద, దాత, ప్రజాప్రతినిధులు ఆకుల రాజేందర్, డి. రాంచందర్, ఆకుల సత్యనారాయణ, పడాల అనిల్ కుమార్, ముకుంద్, విక్కీ విశాల్, ఏలేటి లచ్చిరెడ్డి, ఆకుల లచ్చన్న, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ భాస్కర్ నాయక్ కు సన్మానం

**ధర్మారం, మార్చి 04, మన సాక్షి:**



ధర్మారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కరీంనగర్ కిసాన్ నగర్ 28 వ డివిజన్ కార్పొరేటర్ భాస్కర్ నాయక్ ని ఆహ్వానించారు ఈ కార్యక్రమానికి వచ్చిన కార్పొరేటర్ భాస్కర్ నాయక్ మొదట భారత రత్న రాజంగా నిర్మాత ప్రపంచ మేధావి అయిన బాబా సాహెబ్ అంబేడ్కర్ కి పూల మాల వేసి సన్మాన కార్యక్రమంలో పాల్గొనారు.తను ధర్మారం మండల లోని బంజారుపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ నాయక్ కార్పొరేటర్ కావడం మాకు గర్వకారణం.తను గత 30 సంవత్సరాల నుండి చురుకుగా ఉత్సాహంగా ధర్మారం మండల ప్రజలకు పేదలకు అందరికి అందుబాటులో ఉంటూ ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమర్ఖాన్పేట్ సర్పంచ్ మహేష్,నర్సింగాపూర్ సర్పంచ్ కొమురయ్య,పేర్కపల్లె సర్పంచ్ గొల్ల కృష్ణ, కమర్ఖాన్పేట్ కె తండా సర్పంచ్ వాగ్య నాయక్, ఎర్రగుంటపల్లి సర్పంచ్ దూడ తిరుపతి,మాజీ ఎంపీటీసి బద్ధం అజయపాల్ రెడ్డి,కుమార్ నాయక్, బెక్కం అంజయ్య, కుంటల నర్సయ్య, కెపి శేఖర్, బుట్టి సాగర్(సంతోష్),ఆటో యూనియన్ అధ్యక్షులు మందపల్లి శివరాజ్,మాజీ ఎంపీటీసీ ఎస్సి ఎస్టి మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఐటీ కారిడార్లోని జంక్షన్ల విస్తరణ పనులు పరిశీలన

**శేరిలింగంపల్లి, మార్చి 04,మన సాక్షి:**




హెచ్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని శేరిలింగంపల్లి జోన్లో చేపట్టిన జంక్షన్ల విస్తరణ పనులను బుధవారం సీసీపీ వెంకన్న అధికారులతో కలిసి పరిశీలించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఆదేశాల మేరకు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. పనులలో ఇబ్బందులు తలెత్తకుండా, ప్రయాణీకులు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా సూచించారు. జంక్షన్ల అభివృద్ధితో ఐటీ కారిడార్లో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోనున్నట్లు సీసీపీ వెంకన్న తెలిపారు. హెచ్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా ఖాజాగూడ, సైబరబాద్ కమిషనరేట్, ట్రిపుల్ ఐటీ జంక్షన్లలో విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణీకులు సిబ్బందితో సహకరించాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ శ్యాంకుమార్, ప్రాజెక్ట్ ఈఈ నమ్య నాయక్, ఏసీపీ వెంకటరమణ, టీపీఎస్ అక్బర్, ప్రాజెక్ట్ ఏఈ రాజేష్లు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి..!

**అనంతగిరి,మార్చి 04,మన సాక్షి:**



మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామ శివారులో గల కోళ్ల ఫారమ్ లో బుధవారం విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోళ్ల ఫారంలో పనిచేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన జలాలుద్దీన్, తన భార్య, తోటి పనివారితో కలిసి కోళ్ల ఫామ్ లో షెడ్ క్లీన్ చేస్తున్న సమయంలో విద్యుత్ మోటార్ ఫెయిల్ అయ్యి, షార్ట్ సర్క్యూట్ కావడం వలన షాక్ వచ్చి, అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి తన కుటుంబ సభ్యులకి అందజేసినట్లు పేర్కొన్నారు.మృతుడికి ఒక కూతురు కలదు.

# ప్రభుత్వ పెన్షనర్లకు డిఎ బకాయిలు సకాలంలో అందేలా చూడాలి

**మదనపల్లె రూరల్, మార్చి 04, మన సాక్షి :**



ప్రభుత్వ విశ్రాంత పెన్షనర్లకు డిఏ బకాయిలు ప్రభుత్వం విడుదల చేసిందని అయితే మదనపల్లె పట్టణంలో చాలా వరకు అవి జమకావడం లేదని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ మునిగోపాలకృష్ణ ఆధ్వర్యంలో మదనపల్లె సబ్ ట్రెజరీ ఆఫీసర్ బి.నరేష్ తో కలసి అసిస్టెంట్ సబ్ ట్రెజరీ ఆఫీసర్ బి.లోకేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో కొంత మందికి గత 30 నెలలు డిఏ అరియర్స్ జమచేయడం జరిగిందని,మరికొంత మందికి మార్చి మాసం వచ్చినప్పటికీ అరియర్స్ జమ కాలేదని తమ దృష్టికి రావడంతో స్పందించి వినతిపత్రం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు.ప్రభుత్వం డిఏ అరియర్స్ విడుదల చేసినప్పటికీ నిధులు కొరత వల్ల అందలేదని తమ దృష్టికి వచ్చినట్లు తెలిసిందని,ఈ విషయాన్ని ఏటిఓ మరియు ఎస్టీవోలు పరిగణలోనికి తీసుకొని విశ్రాంత పెన్షనర్లకు డిఏ అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి నెలలో అరియర్స్ అందకపోగా మార్చి నెల మొదటి వారంలోనూ ఇంకా రాలేదని,దీనిపై ప్రభుత్వము మరియు అధికారులు పెన్షనర్ల మనోభావాలను గౌరవించి న్యాయం చేయాలని కోరారు.తమ విజ్ఞప్తిపై మదనపల్లె ఏటీవో మరియు ఎస్టీవోలు సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా వారికి కుటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కరుణాకర్,ఆంధ్ర పెన్షన్స్ పార్టీ కోశాధికారి పిసి తిమ్మయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**కంగ్టి, మార్చి 04,మన సాక్షి :**



పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.కంగ్టి మండలం తడ్కల్ జామ మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. గాజుల పాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మస్తాన్ సాబ్ ఆధ్వర్యంలో రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో డిసిసి ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉప వాస దీక్ష విడిపించారు. సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలిచల సుగుణ మల్లారెడ్డి,మైనార్టీ అధ్యక్షులు డాక్టర్ హమీద్, వినోద్ పాటిల్ , రాజు, ఫారూఖ్ ఖాన్ , మైతాజ్ ,రహీం సార్ , ఇర్ఫాన్ ముస్లిం సోదరులు ఉన్నారు.

# అద్దెలు చెల్లించమంటే దౌర్జన్యం... ఎఎస్పీకి బాధితుల ఫిర్యాదు..!

**మదనపల్లి రూరల్, మార్చి 4, మన సాక్షి:**



నివాసముంటున్న ఇంటికి,వ్యాపారం నిర్వహిస్తున్న హోటల్ కు అద్దెలు చెల్లించకుండా, ఖాళీ చెయ్యకుండా పార్టీని అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు దిగుతున్నాడంటూ బాధితులు బుధవారం అడిషనల్ ఎస్పీ వెంకటాద్రికి ఫిర్యాదు చేసి,న్యాయం చేయాలని అభ్యర్థించారు.బాధితుల ఫిర్యాదు మేరకు జనసేన పార్టీ మైఫోర్స్ మహేష్ స్థానిక నీరుగట్టువారిపల్లి రామాలయం వీధిలో మునిరత్నంకు చెందిన ఇంటిని నెలకు రూ.8 వేలకు అద్దెకు తీసుకుని కొన్ని నెలలుగా అద్దె చెల్లించలేదని బాధితుడు మునిరత్నం ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఇప్పటివరకు రూ.3.4లక్షలు అద్దె బకాయి ఉన్నాడని,డబ్బు చెల్లించడు, ఖాళీ చెయ్యమంటే దౌర్జన్యానికి దిగుతున్నాడని,న్యాయం చేయాలని అభ్యర్థించాడు. అదే విధంగా ఎస్బీఐ కాలనీ వాసి సుధాకర్ రెడ్డి గొల్లపల్లె రింగ్ రోడ్డులో బిల్డింగ్ నిర్మించాడు. అందులో మొదటి రెండుఫోర్లు మైఫోర్స్ మహేష్ హోటల్ నిర్వహణకు భార్య సంగీతరెడ్డి పేరుమీద అద్దెకు తీసుకున్నాడు.అప్పటి నుంచి పార్టీని అడ్డం పెట్టుకుని అద్దె చెల్లించకుండా వేధిస్తున్నాడని బాధితుడు సుధాకర్ రెడ్డి ఎఎస్పీకి మొరపెట్టుకున్నాడు.ఇప్పటి వరకు రూ.45 లక్షలు అద్దె బకాయి ఉన్నాడని,ఖాళీ చెయ్యమంటే తమ్ముడు ఉమేష్ తో కలిసి దౌర్జన్యం చేస్తున్నాడని సుధాకర్ రెడ్డి వాపోయాడు.జనసేన పార్టీని అడ్డం పెట్టుకుని మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని తగు న్యాయం చేయాలని ఎఎస్పీని అభ్యర్థించాడు.విచారించి తగు న్యాయం చేస్తానని ఎఎస్పీ ఇరువురికి హామీ ఇచ్చారు.

# ఉత్సాహంతో రంగుల పండగ



**గరిడేపల్లి,మార్చి 04,మన సాక్షి:**

గరిడేపల్లి మండల పరిధిలోని కితా వారిగూడెం గ్రామంలో బుధవారం హోలీ పండుగ గ్రామమంతా ఘనంగా నిర్వహించారు చిన్నలు పెద్దలు యువకులు మహిళలు ప్రతి ఒక్కరూ హోలీ పండుగలో రంగులు జల్లుకొని ఆనందంతో పులకించిపోయారు, గ్రామంలోని రామాలయం గుడి వద్ద ఉట్టిని ఏర్పాటు చేసి ఉత్సాహంతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, అన్ని వర్గాల ప్రజలు హోలీ పండు జరుపుకోవటం ఎంతో ఆనందకరంగా ఉందని,గ్రామ ప్రజలు తెలియజేశారు వేర్వేరు గ్రామాల్లో పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తూ హోలీ పండుగకు ఇంటికి వచ్చి ఆనందంగా హోలీ పండుగ జరుపుకుంటున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఆలయ కమిటీ సభ్యులు నాయకులు పాల్గొని హోలీ పండుగను విజయవంతం చేశారు. గ్రామంలోని అన్ని దేవాలయాలలో పూజలు నిర్వహించారు శివాలయ కమిటీ చైర్మన్,రామాలయ కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు

# మ్డమా డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్ట్..!

## 12.6 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

**శేరిలింగంపల్లి, మార్చి 04,మన సాక్షి:**

మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత మ్డమా డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామని మియాపూర్ ఇన్ స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిన్న మధ్యాహ్నం (మార్చి 3వ) తేదీ విశ్వంభర కాలనీ పార్క్ సమీపంలో ఒక వోక్స్ వ్యాగన్ కారులో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మియాపూర్ పోలీస్, మాదాపూర్ ఎస్ఓటి బృందం మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో అక్కడికి చేరుకుని సదరు వాహనాన్ని తనిఖీ చేశారు. పోలీసులను గమనించి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా, వారిని చేజ్ చేసి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, కార్ డ్యాష్ బోర్డులోని జిప్‌లాక్ కవర్‌లో తెల్లటి క్రిస్టలైన్ పదార్థం లభ్యమైందన్నారు.

డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా అది 12.6 గ్రాముల మ్డమా గానిర్ధారణ అయిందని తెలిపారు. నిందితులు బేరి హనుమంతు (27), భూమని మహేష్ (26), కాసం ఆదర్శ్ (28)లను అరెస్ట్ చేసి విచారించగా, వారు బెంగళూరు నుంచి ఈ డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో అధిక లాభాలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల నుంచి డ్రగ్స్‌తో పాటు, ఒక వోక్స్ వ్యాగన్ కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రస్తుతం నిందితులపై నుప్స్ చట్టం కింద కేసు నమోదు చేసి, డ్రగ్ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆపరేషన్ కుకట్‌పల్లి జోన్ అదనపు డీసీపీ ఎం. సుదర్శన్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించామన్నారు. డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను నాశనం చేస్తోందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగం గురించి మీకు ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.




# ఆహ్లాదకరంగా చింతపల్లి సాయిబాబా మందిరం

## జస్టిస్ రాజశేఖర్ రెడ్డి

**చింతపల్లి,మార్చి 04,మన సాక్షి:**



చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా మందిరం ఎంతో ఆహ్లాదకరంగా ప్రశాంతతకు నిలయంగా మరో షిరిడి దేవాలయంగా వెలుగొందడం ఎంతో హర్షించదగ్గ విషయమని లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా మందిరాన్ని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి దంపతులను సాదరంగా ఆహ్వానించి ఆలయ పూజారులచే ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం సాయి సన్నిధిలో నిర్వహిస్తున్న గోశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం వారికి ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, సాయిబాబా ప్రతిభను, అందజేసిన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చైర్మన్ మంచి కంటి ధనంజయ, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, గోశాల నిర్వాహకులు కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళ శ్రీనివాస్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు పైనుండి పడి గీతకార్మికునికి గాయాలు



**సూర్యాపేట,మార్చి 04,మన సాక్షి:**

శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు భూపతి వెంకటయ్య( 55)తాటి చెట్టుపైనుండి పడి పోవడంతో తీవ్ర గాయాలు అయినాయు. మంగళవారం సాయంత్రం తాటి చెట్లు ఎక్కేందుకు వెళ్లిన భూపతి వెంకటయ్య చెట్టు ఎక్కరు ప్రమాద వశస్తూ కాలు జారీ కింద పడిపోయాడు దింతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం నల్లగొండ లోని ఆసుపత్రి కి తరలించారు. తాటి చెట్టు నుండి పడిన వెంకటయ్య ను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# ఖనిలో హోలీ సంబరాలు



**గోదావరిఖని,మార్చి 04,మన సాక్షి:**

రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరి ఖని చౌరస్తాలో బుధవారం హోలీ సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నా పెద్దా తేడా లేకుండా కొత్తగా ఎన్నికైన పాలకవర్గం ప్రజలతో మమేకమై పని చేస్తుందని అన్నారు. రామగుండం నగరం 2029 నాటికి సకల సౌకర్యాలతో సంపూర్ణశీగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే రూ 800 కోట్లతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలందరూ సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సంబరాలలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆమనగల్లు జాతరలో అపశృతి..!



**వేములపల్లి, మార్చి 04, మన సాక్షి:**

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో కొలువైన శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది.. బుధవారం తెల్లవారుజామున స్వామివారి పల్లకిని అగ్నిగుండాలు దాటిస్తుండగా.. ఒక్కసారిగా తోపులాట జరగడంతో అగ్నిగుండంలో పడి పలువురు భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన భక్తులను... ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ విధుల్లో ఉన్న ఎస్ఐలు,తమ పోలీస్ సిబ్బంది చాకచక్యంగా స్పందించి వెంటనే వారిని బయటికి తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

# బుద్ధవనంలో బోధి మొక్కను నాటిన థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు

**నాగార్జునసాగర్, మార్చి 04, మన సాక్షి :**



నాగార్జునసాగర్ లోని బుద్ధ వనములో ధమ్మా యాత్రలో పాల్గొన్న థాయిలాండ్ బౌద్ధ బిక్షువుల ఆధ్వర్యంలో బుధవారం బోధి (రావి )మొక్కను నాటారు. దమ్మ పాదయాత్ర ముగింపు సందర్భంగా థాయిలాండ్ ముఖ్య బౌద్ధ భిక్షువు సంఘ సక్ కోవిడో( అజాన్ తున్ ) ఆధ్వర్యంలో బుద్ధవనంలోని స్తూప వనములో థాయిలాండ్ స్థూపం వద్ద బుద్ధ వనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచనల మేరకు బోధి మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దమ్మా యాత్రలో భాగంగా బుద్ధ వనములో తాము గడిపిన రోజులు జీవితంలో మర్చిపోలేమన్నారు. మరో మూడు రోజులు పాటు బుద్ధవనం లోనే ఉంటామని తెలిపారు. దమ్మయాత్ర విజయవంతమవడానికి మొదటినుండి చివరివరకు సహకరించిన బుద్ధ వనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావును ప్రత్యేకంగా అభినందించారు, ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, సీనియర్ అసిస్టెంట్ రాంకుమార్, బుద్ధవనం ప్రాజెక్ట్ సిబ్బంది మరియు నరసింహారావు, ప్రజ్ఞానంద్ థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు, గగన్ మాలిక్ ఫౌండేషన్ మేనేజర్ వికాస్ టైడే తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు భాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

**గోదావరిఖని టౌన్,మార్చి 04,మన సాక్షి:**



వార్డు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు , నగర పాలక సంస్థకు మధ్య వార్డు అధికారులు వారధి గా పని చేయాలని అన్నారు. శానిటేషన్ నిర్వహణ, ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. స్వచ్ఛ రామగుండశీ గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని అన్నారు. ఈ నెల తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తి పన్ను వసూళ్లు ఆశించినంతగా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి లోపు వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.రామన్, అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , జూనియర్ అసిస్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ కిట్లు పంపిణీ అభినందనీయం

**మిర్యాలగూడ, మార్చి 04, మన సాక్షి:**



మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సేవలు అజరామరం అని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యులే మార్గదర్శి అని కొనియాడారు. రంజాన్ పండుగ సందర్భంగా పలు ముస్లిం కుటుంబాలకు హమీద్ షేక్ చేతుల మీదుగా రైస్ మిల్లర్లు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో హమీద్ షేక్ మాట్లాడారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మానవత్వానికి, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని కొనియాడారు. రంజాన్ కిట్ల పంపిణీ అనంతరం తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్,మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోళ్ళరామ్ శేఖర్, కార్యదర్శి బాబీ, పోలిశెట్టి ధనుంజయ, కోశాధికారి గందె రాముకు హమీద్ షేక్ హార్థిక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రషీద్, ముర్తుజా, హాజీ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక జిల్లా సన్నాహక సమావేశం

**నల్లగొండ,మార్చి 04,మన సాక్షి:**



రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులోని ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించనున్న 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు “ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక” కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని , నిర్దేశించిన తేదీల ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికపై ఈ నెల 6న ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశాన్ని నల్గొండలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా వివిధ శాఖల ద్వారా నిర్వహించే కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాలన్నింటిలో గ్రామస్థాయి మొదలుకొని జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులు అందరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ , మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,ఆర్ డి ఓ లు,జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026కు నల్లగొండ పోలీస్ కబడ్డీ క్రీడాకారిణి ఎంపిక

**నల్లగొండ,మార్చి 4,మనసాక్షి**



నల్లగొండ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతిభావంతమైన కబడ్డీ క్రీడాకారిణి షైక్ నౌషీన్ ఆల్ ఇండియా పోలీస్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ - 2026 మీట్‌కు ఎంపిక కావడం గర్వకారణమని ఈ ప్రతిష్టాత్మక పోటీలు జమ్మూ అండ్ కాశ్మీర్ లో మార్చి 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు నిర్వహించినట్లు ఎస్పి శరత్చంద్ర పవర్ తెలిపారు. ఈ కబడ్డీ క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తరఫున కెప్టెన్ గా బాధ్యత వహించనున్నారు. 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2026 పోటీలు ఫిబ్రవరి 16 నుండి 21 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం మరియు సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించారని ఈ క్రీడా పోటీలలో యాదాద్రి -ఎ జోన్ జట్టు తరఫున కబడ్డీలో బంగారు పతకం సాధించగా, 3వ పోలీస్ స్టేట్ మీట్ తరఫున రజత పతకం సాధించారు. ఈ రెండు సందర్భాల్లోనూ జట్టుకు కెప్టెన్‌గా నాయకత్వం వహించి విశిష్ట ప్రతిభ కనబరిచారు. షైక్ నౌషీన్ ఇప్పటివరకు 20 సార్లు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా 3 సార్లు ఇండియన్ క్యాంప్స్‌లో పాల్గొని తన నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకున్నారని 2025లో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ నగరంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి జట్టును విజయవంతంగా నడిపించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ షైక్ నౌషీన్ ను అభినందిస్తూ, జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎన్జీ కళాశాల విద్యార్థికి టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్..!

**నల్లగొండ, మార్చి 04, మన సాక్షి:**




నాగార్జున ప్రభుత్వ కళాశాల (ఆటానమస్), నల్గొండకు చెందిన ఎన్. మనోజ్ యాదవ్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ 2025-2026లో యు-80కేజీ విభాగంలో సీనియర్ గోల్డ్ మెడల్ పతకం సాధించారు. అఖిల భారత ఇంటర్ యూనివర్సిటీ నేషనల్స్‌లో పంజాబ్‌లో దేవ్ విశ్వవిద్యాలయం జలంధహర్ ఈనెల 16 నుండి 20 వరకు జరిగే పోటీల్లో అతను ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, కళాశాల సిబ్బంది మనోజ్ యాదవ్‌ను,ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అదే మల్లేశంని అభినందించారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు అతని విజయం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఎం వెంకట రెడ్డి , డాక్టర్ వెంకటేశం, నర్సింగ్ కోటయ్య ,మన్నెం వెంకటయ్య , బోధన బోధనేతర సిబ్బంది పాల్గొని అభినందించారు.

# అంతర్జాతీయ మహిళ దినోత్సవం కానుక



హైదరాబాద్:రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. హాస్పిటళ్లలో రోజువారీ వైద్య సేవలకు ఆటంకం కలగకుండా 99 డేస్ యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని సూచించారు. అధికారులు రూపొందించిన ప్రణాళికను స్వల్ప మార్పులతో మంత్రి ఆమోదించారు. మొత్తం 4 దశల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో మార్చి 6 నుంచి 31వ తేదీ వరకు 26 రోజుల పాటు మాతా శిశు సంరక్షణ, కౌమార దశ బాలికలు, వృద్ధుల ఆరోగ్య సేవలపై దృష్టి కేంద్రీకరించనున్నారు. హాస్పిటళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ, పెండింగ్ ౖ÷ళ్లై పరిష్కారం, ఆస్తుల వెరిఫికేషన్ వంటి పరిపాలనా పరమైన అంశాలను చక్కదిద్దడంతో పాటు.. క్షేత్రస్థాయిలో రక్తహీనత నివారణ, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెల్ఫ్ హెల్ఫ్ గ్రూపు మహిళల హెల్త్ ప్రొ÷ల్ తయారీ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ సహకారంతో ఒక్కో మహిళకు మొత్తం 30 రకాల పరీక్షలు చేయనున్నారు. మార్చి 8 నుంచి మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు పరీక్షలు చేయనున్నారు. తొలి దశలో ప్రతి జిల్లా నుంచి 5 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, రెండో దశలో మరో 10 మండలాల్లో, చివరి దశలో మిగిలిన అన్ని మండలాల్లో స్క్రీనింగ్ చేపట్టనున్నారు. మొత్తం స్క్రీనింగ్‌ను 6 నెలల్లో పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ప్రజాపాలన రెండో దశను ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ 15 రోజుల్లో అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కేన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. జిల్లా డే కేర్ కేన్సర్ సెంటర్లలో కీమోథెరపీ సేవలను మ్యాపింగ్ చేయడంతో పాటు, డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సాగే మూడో దశలో అంటువ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య సన్నద్ధతపై యంత్రాంగం దృష్టి సారించనుంది. టీబీ ముక్త్ భారత్ లక్ష్యంగా టీబీ కేసులను గుర్తించడంతో పాటు.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వడదెబ్బ, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ౖ÷ళి 16 నుంచి జూన్ 12 వరకు నాలుగో దశలో పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి, స్పెషాలిటీ వైద్య సేవలను అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వెహికిల్స్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యం చేరువ చేయనున్నారు. ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించి ప్రజల్లో కల్తీ ఆహారంపై చైతన్యం తీసుకురావాలని మంత్రి సూచించారు.

# ఏఐసిసి ఇన్చార్జ్ మాణిక్ రావు టాకరేని కలిసిన శ్రీజ్యోతిబీమ్ భరత..!

**శంకర్‌పల్లి,మార్చి 04,మన సాక్షి:**



ఏఐసీసీ సభ్యుడు, ఇన్చార్జ్ మాణిక్ రావు టాకరేని బుధవారం రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతిబీమ్ భరత్ శంషాబాద్ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని మాణిక్ రావు తాకరే సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్ భీమ్ భరత్ ఉన్నారు.

# భార్య కాపురానికి రాకపోవడంతో ఆవేదన

పెద్దపల్లి: కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన చెప్పాల దేవేందర్ (38) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి మంథని ప్రధాన రహదారిలో గల గుండారం గ్రామ శివారులోని పత్తి చేనులో ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ, సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి సంస్థ ఆర్జీ- 3 పరిధిలోని సెంటినరిరాలనీ నర్సరీలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి దేవేందర్ పేరపల్లిలోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గుండారం శివారులోని ఓ పత్తి చేనులో దేవేందర్ మృతదేహం కనిపించింది. దేవేందర్ గత 15 ఏళ్ల క్రితం పేరపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్వరి అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు.

# ఇరాన్ రహస్య భూగర్భ అణు ప్రాజెక్ట్ ధ్వంసం

## దాడిలో ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళం ప్రకటన

టెహ్రాన్: ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రతరం చేసింది. ఈ క్రమంలోనే ఇరాన్ రహస్య భూగర్భ అణుప్రాజెక్టును తమ దళాలు ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదెహైలో రహస్యంగా ఏర్పాటుచేసిన న్యూక్లియర్ కేంద్రం కాంపౌండ్‌పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ తెలిపారు. ఈ కేంద్రంలో శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడికి మళ్లించినట్లు పేర్కొన్నారు. గతేడాది జూన్‌లో తాము ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో 12 రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని డెఫ్రిన్ ప్రస్తావించారు. ఆ సమయంలో వాడిన మందుగుండు సామగ్రి కంటే ఎక్కువ పేలుడు పదార్థాలను ఈ నాలుగు రోజుల్లో ఇరాన్‌పై ప్రయోగించినట్లు తెలిపారు. గతంలో తాము ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేసినప్పటికీ ఆ దేశం అణు కార్యకలాపాలను ఆపకుండా.. అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వాటిని టెహ్రాన్ శివార్లలోని రహస్య భూగర్భ స్థావరంలో భద్రపరిచిందని తమకు కచ్చితమైన సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన 300 క్షిపణి లాంచర్‌లను తాకాయని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆ దేశంలోని బాలిస్టిక్ క్షిపణి శ్రేణులు, వైమానిక రక్షణ వ్యవస్థలపై తమ వైమానిక దళాలు దాడులు కొనసాగిస్తున్నాయన్నారు. ఇజ్రాయెల్ చేపట్టిన తాజా దాడులకు సంబంధించిన దృశ్యాలను ఐడీఎఫ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది.

# ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా ?

వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది. అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్ధంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి.. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ఫ్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5-6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్ఘానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్‌తో తలపడుతోంది. ఈ నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుం టున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పులు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్‌నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఇరాన్ నేతగాఖమేనీ కుమారుడు ముజ్తబా?



## అధికార మార్పిడి జరిగిందని ప్రచారం

## అధికారికంగా వెల్లడించడమే తరువాయి

టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీఖమేనీ మరణించడంతో ఇరాన్ తదుపరి నాయకత్వంపై సందిగ్ధం నెలకొంది. ఎవరు పగ్గాలు అందుకుంటారన్న చర్చలో ఖమేనీ కుమారుడే ముందువరసలో ఉన్నట్లు సమాచరం. ఇప్పుడా పాలనా పగ్గాలను ఖమేనీ కుమారుడు ముజ్తబా హొస్సేనీ ఖమేనీకి అప్పగించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ లేని ముజ్తబా.. త్వరలోనే సుప్రీంలీడర్ గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఆయతుల్లా అలీ ఖమేనీ రెండో కుమారుడే ముజ్తబా. 1969లో ఇరాన్‌లోని మషాద్‌లో జన్మించారు. ముజ్తబా పదేళ్ల వయసులోనే ఇరాన్ రాజు మహమ్మద్ రెజా పహ్లవీకి వ్యతిరేకంగా 1979లో ఇస్లామిక్ విప్లవం జరిగింది. ఆ సమయంలో ఖమేనీ కుటుంబం రాజకీయంగా ఎదిగింది. ఆ తర్వాత వీరి కుటుంబం టెహ్రాన్‌లో స్థిరపడింది. కోమ్‌లోని సెమినరీస్‌లో మత విద్యను అభ్యసించిన ముజ్తబా ÷-లకెరికల్ ర్యాంక్‌కు చేరుకున్నారు. కానీ, అత్యున్నత ర్యాంక్ అయిన ఆయతుల్లాను అందుకోలేకపోయారు. అయినా సుప్రీంలీడర్ కార్యాలయంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా మారారు.1980ల్లో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో ముజ్తబా పాల్గొన్నాడు. ఆ అనుభవమే ఇరాన్ సైన్యానికి ఆయనను దగ్గర చేసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)తో ఆయనకు బలమైన సంబంధాలు ఉన్నాయి. ముజ్తబాకు సుప్రీం పదవి దక్కడానికి ఇదీ ఓ కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. సాధారణంగా సుప్రీంలీడర్ నియామకాన్ని చేపట్టేందుకు 88 మంది షియా మత పెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) ఉంటుంది. ఇందులో సభ్యులను ప్రత్యక్ష ప్రజా ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని ఈ కమిటీ భావిస్తుంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ముజ్తబా నియామకానికి ఈ కమిటీలోని కొందరు సుముఖంగా లేరని, కానీ ఐఆర్‌జీసీ ఒత్తిడితోనే ఆయనకు పగ్గాలు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారని సమాచారం.

ముజ్తబా ఇప్పటివరకు ఇరాన్‌లో అధికారిక పదవులేవీ చేపట్టలేదు. బహిరంగ ప్రసంగాల్లోనూ అరుదుగా కన్పించేవారు. అయినా రాజకీయ నియామకాలు, పాలనాపరమైన నిర్ణయాల్లో తెర వెనుక కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ముజ్తబా ఖమేనీపై 2019లో అమెరికా ఆంక్షలు విధించింది. అయినా ఆయన ప్రపంచవ్యాప్తంగా సంపన్న సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేయడమే గాక.. పశ్చిమ మార్కెట్లలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. ముజ్తబా నికర సంపద ఎంతనే దానిపై స్పష్టత లేదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఆయనకు పెట్టుబడులు ఉన్నాయట. స్విస్ బ్యాంకు ఖాతాల్లో పెద్దఎత్తున డిపాజిట్లతో పాటు.. బ్రిటన్‌లో 138 మిలియన్ డాలర్ల విలువైన లగ్జరీ ప్రాపర్టీ ఆయన పేరు మీద ఉన్నట్లు సమాచారం. ఇరాన్ సంప్రదాయ వాద రాజకీయ నాయకుడు ఘోలమ్ అలీ కుమార్తె జహ్రాను ముజ్తబా 2004లో వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరి కుటుంబం గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. అయితే, ఇటీవల ఇజ్రాయెల్-అమెరికా జరిపిన సంయుక్త దాడుల్లో ముజ్తబా భార్య మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం లేదు.

ఈ దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మరణించినట్లు సమాచారం.



# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి

## యుంద్ధం అన్నది మా ప్రణాళికలో భాగం

## విమర్శలకు దీటుగా స్పందించిన ఇజ్రాయిల్

న్యూఢిల్లీ:ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్‌లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా.. మరుసటి రోజు ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది. ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, ఖండించడం లేదని విపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. మోడీ తీరువల్ల భారత్ పరువు పోయిందని గగ్గోలు పెడుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్‌పై దాడి చేసింది. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్‌పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. దాడులకు చాలా కాలం ముందునుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నామని చెప్పుకొచ్చారు.మోడీ పర్యటనలో యుద్ధం గురించి ఎందుకు మాట్లాడుతామని అన్నారు.



Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.